# తిరుగు ప్రయాణం

రచన:
శ్రీమతి పి. మాణిక్యం

"రామాపురం వచ్చింది, దిగండమ్మా!" కండక్టరు పిలుపుతో త్రుళ్ళిపడి లేచింది మాధురి. బ్యాగ్ భుజానికి తగిలించుకొని పొలాల మధ్య నుండి నడుస్తోంటే మనసంతా ఉల్లాసంగా, హాయిగా, అహ్లాదం కలిగిస్తోంది! పచ్చని ప్రకృతి తనను ఆదరంగా ఆహ్వానిస్తున్నట్లే అనుభూతి కలుగుతోం దామెకు.

పక్షులు గూటికి చేరుకుంటున్నాయి. పశువులను ఇళ్ళకు తోలుకు పోతున్నారు, పశువుల కాపరులు.

బాలభానుడు తన డ్యూటీ అయిపోయిందని సూచిస్తూ మెలమెల్లగా తప్పుకుంటున్నాడు.

"అరే అదేమిటమ్మా! ఉత్తరమైనా వ్రాయకుండా వచ్చేసావు. అల్లుడుగారు కులాసాయేనా!" ఆదరంగా పలకరించారు రంగారావుగారు.

"ఆయనకేం! బాగానే ఉన్నారు, ఎటొచ్చీ నేనే ఆయనతో వేగలేక వచ్చేసాను."

"ఏం జరిగిందమ్మా!"

"నిన్న సాయంత్రం త్వరగా వచ్చి నన్ను సినీమాకు తీసుకెళతానని ప్రామిస్ చేసారు. నేను రెడీ అయి అతని కోసం ఎదురు చూసాను. ఎప్పుడొచ్చారో తెలుసా?

తొమ్మిది గంటల కొచ్చి.........

"సారీ మధూ! ఈ రోజు మా ఆఫీస రొచ్చాడు! అందుకే నిన్ను పిక్చరుకు తీసుకెళ్ళలేక పోయాను. అయామ్ సారీ, రేపు తప్పకుండా వెళదాం! చాలా అలసటగా వుంది" అంటూ, భోజనమైనా చెయ్యకుండా మంచమ్మీద వాలారు. "నాకు వొళ్ళు మండి వచ్చేసాను" గదగదా చెప్పేసి లోపలకు నడచింది మాధురి.

మౌనంగా నిట్టూర్చారు రంగారావుగారు.

చిన్నప్పటి నుండీ మధు తత్వమే అంతే! తల్లి లేని ఒక్కగా నొక్క పిల్లకదా అని అడిగిందల్లా ఇచ్చి గారాబం చేసాడు తను.

రామాపురంలో పోష్టుమాష్టరు తను.

ఏనాడూ ఆమె అడిగింది కాదనలేదతను. చెప్పాలంటే అల్లుడుగారు మణిపూస. అలాంటి వాడిని ప్రతి చిన్న విషయానికీ అతనితో తగవులాడుతూ వచ్చేస్తుంది. ఆమెను ఒప్పించి పంపించే సరికీ తలప్రాణం తోకకొస్తుంది ఆయనకు.

* * *

ఏంటయ్యా! ఇంకా ఉత్తరాలు చూస్తూ కూర్చున్నావు. ఇనస్పెక్టరుగారు వచ్చేస్తున్నారు! మాష్టరుగారింట్లో ప్లాస్కు తీసుకెళ్ళి కాఫీ తీసుకురా!" గుమస్తా నారాయణరావు పోస్టుమేన్, (ఇ.డి.డి.ఎ.)కు పురమాయించాడు. ఆఫీసు స్టాఫ్ అంతా హడావిడిగా ఉన్నారు.

* * *

సాయంత్రం ఐదు గంట లవుతోంది, తను వచ్చి ఈ రోజుకు సరిగా నెలవుతోంది. పట్నం నుండి ఉత్తరాలు వస్తునే ఉన్నాయి భర్త దగ్గరనుండి. తనకు తీరికగా లేదని మామగారిని తీసుకురమ్మని వ్రాస్తున్నాడు అల్లుడు. ఇక్కడ ఇనస్పెక్షను జరుగుతోంది. తనకూ తీరిక లేదని సమాధానం వ్రాసాడు మామగారు. కాని ఇవేవీ ఆమెను కదిలించడం లేదు.

ఇనస్పెక్టరు గారొచ్చి మూడు రోజులయింది. స్నానం, భోజనం, నిద్రా అన్నీ, ఆఫీసులోనే — అంటే తమ ఇంట్లోనే। ఆయనకు హోటలు తిండి పడదట! అందుకే తండ్రి కోరినమీదట తనే వండుతోంది.

ఏమాట కామాటే చెప్పుకోవాలి, మాధురి వంట అద్భుతంగా చేస్తుంది!

ఆ రోజు —

ఆఫీసు పనిమీద రంగారావు గారిని పట్నం పంపించారు ఇనస్పెక్టరుగారు. తండ్రి రాకకోసం ఎదురుచూస్తూ వరండాలో గోడకు చేరబడి నిల్చుంది మాధురి. తను చేరబడ్డ గోడ కిటికీగుండా ఏదో గుసగుసలు వినరావడంతో చెవులు రిక్కించిందామె.

"అలాగే సార్! అదెంత పని, మాధురిని ఒప్పించే పూచీ నాది, సరేనా! మొగుడ్ని వదిలి వచ్చినదామె ఒప్పుకోక ఏం చేస్తుంది!" అది ఆసిరిగాడి గొంతు.

"ఏమిటి చెప్తావో ఏదో నా కనవసరం. పట్నంనుండి మాష్టారు రాకముందే ఆమె నాది కావాలి." ఆజ్ఞ జారీ చేసారు ఇనస్పెక్టరు బాలక్రిష్ణగారు,

"అలాగే సార్!"

"మీరంటే ఇనస్పెక్టరుగారు పడి చస్తున్నారమ్మా, మీరు కోరితే ప్రాణమైనా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. లోకం దృష్టిలో ఆయనకు పెళ్ళయ్యింది కాని, ఆమె ఇత నిని కేర్ చెయ్యదు. తన ఆఫీసులో పని చేసే గుమస్తాను ఇంటికి రప్పించుకుంటుంది. ఆమెను మందలించే శక్తి ఈయనకు........"

"అసిరిగా!" గట్టిగా అర్చాడు గుమస్తా నారాయణ రావు.

అవమానంతో తల వంచుకున్నాడు ఇనస్పెక్టరు బాలకృష్ణ.

"సారీ సార్! వాడేదో తెలివి తక్కువగా వాగాడు, క్షమించండి సార్!" అసిరిగాడి తరపున క్షమాపణ కోరాడు గుమస్తా.

"ఆ...... హాఁ...అలా చెప్పను లెండి! ఏదో లాగ చెప్పి మీ దారికి తెద్దామని...."

"సరేలే, వెళ్ళు." గుమస్తా కసిరే సరికి గబగబా బయ టకు నడిచాడు అసిరిగాడు,

* * *

"ఎవరూ! ఇనస్పెక్టరు గారా! లోపలి కొచ్చారేమిటి? నాన్నగా రింకా రాలేదు." భయంగా చూసింది మాధురి.

"నేను మీ నాన్నగారి కోసం రాలేదు. మీ కోసమే వచ్చాను. అసిరిగాడు చెప్పలేదా?"

"ఓ...అదా! చెప్పాడు. కూర్చోండి." కుర్చీ చూపించింది.

ఆమె చూపిన కుర్చీలో కూర్చుంటూ —— "మరి మీకు ఇష్టమేనా?" ఆమె చేయి నందుకోబోతూ అడిగాడు ఇనస్పెక్టరు బాలకృష్ణ.

"ఆఁ....ఆఁ.....కాస్త ఆగండి! ఇష్టమే కాని చిన్న షరతు. దానికి మీ రంగీకరిస్తే....!

"ఓ...కే....చెప్పు! అది యెలాంటిదైనా పాటించి (సాధించి) నీ కోర్కె తీరుస్తాను."

"మీరు తలచుకుంటే అదేమంత పెద్దదేం కాదు లేండి. మీ రుండేది పట్నంలోనే కదా! మేం కూడా అక్కడే ఉంటున్నాం!

మనిద్దరం ఇంతానందంలో ఉన్న సమయంలో మనకు ——మీన్. మీకు మీ ఆవిడ, నాకు మా ఆయన ఉన్నా రన్న విషయం మర్చిపోకూడదు కదా! అందుకని ...."

"ఊఁ....అందుకని...?" రెట్టించా డాయన.

"మా ఇంటి అడ్రసు ఇస్తాను. మీ ఆవిడను తీసుకెళ్ళి మావారి కప్పజెప్పి రండి! ఈ రోజుకు హాయిగా తియ్యగా అనుభవించమని చెప్పిరండి! గుమస్తాకంటే మా వారు నయమే, గనుక మీకు అసలు కష్టం అన్పించక పోవచ్చు. కాని, ఆయన కాస్త ఆలోచించే మనిషి! పరవాలేదు, ప్రయత్నించి చూడండి! ఆ తరువాత మనం ఇక్కడ హాయిగా ఉండొచ్చు! ఏమంటారు!" అతని ముఖంలోకి పరిశీలనగా చూస్తూ అంది మాధురి.

సలసలా మరుగుతున్న నూనె ముఖంమీద జల్లి నట్లుంది - ఇనస్పెక్టరు బాలక్రిష్ణగారి పరిస్థితి. సమాధానం ఇవ్వకుండానే తల దించుకున్నాడు.

"పోనీ మీ భార్య మీ మాట వినే స్థితి దాటి పోయిం దనుకోండి? మిమ్మల్ని రెచ్చగొట్టి పంపించిన నారాయణ రావు భార్య పార్వతి అయినా పరవాలేదు. చివరకు మీకు రాయబారం చేసిన అసిరిగాడి పెళ్ళామైనా అడ్జెస్టు అయి పోతారాయన "

ఏమి జరుగుతుందో అని వినోదంగా తలుపు సందు ల్లోంచి చూస్తున్న నారాయణరావు, అసిరిగాడి ముఖాలు ఆ మాటలకు నల్లగా మాడిపోయాయి. మీకు ఇంత సహాయ పడి మీ మెప్పు పొందాలని ఆశించేవారు, ఆ మాత్రం సహాయం చేసి ప్రమోషన్లు కూడా పొందగలరు. యేమం టారు మిస్టర్ బాలక్రిష్నన్? నన్ను కోరడం మీ తప్పు కాదు - లోకం తీరు.

ఆడది ఒంటరిగా ఉందంటే ఏ క్షణంలో ఏం ముంచు కొస్తుందో అన్నట్లున్నాయి రోజులు. నన్ను మీరు అపార్థం చేసుకోవడానికి అవకాశం కల్పించినది నేనే! ఆడది యెప్పుడూ ఒకరి నీడన ఉండక తప్పదన్న సత్యాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను."

మౌనంగా బయటకు నడిచాడు బాలక్రిష్ణ.

* * *

మరుచటి రోజు ఉదయమే బయలుదేరిన కూతుర్ని ఆశ్చర్యంగా చూస్తూ "ఇదేమిటమ్మా! అల్లుడుగారు వచ్చి తీసుకెళతానని వ్రాసారుగా! అప్పుడే అంత తొందర యెందుకూ!" అన్నారు రంగారావుగారు.

"పరవాలేదు నాన్నా! నేనే వచ్చాను. నేనే వెళ్ళి పోతాను! ఆయనకు శలవులు లేవు." అంటూ యెంత చెప్పినా విన్పించుకోకుండా "తిరుగు ప్రయాణం" అయ్యింది మాధురి!

ఆమెలో వచ్చిన మార్పుకు మనసారా దేవుడ్ని మ్రొక్కాడు తండ్రి!